క్లుప్తంగా

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



అయ్యప్ప మాల ధరించిన భక్తులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో 75 మంది భక్తులు సోమవారం అయ్యప్ప మాల ధరించారు. ఈసందర్భంగా గణపతి హోమం, అయ్యప్పస్వామికి పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. కాగా, ఈనెల 16నుంచి నవంబర్ 30వ తేదీ వరకు మాలధారులకు అన్నప్రసాదం(భిక్ష) ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ప్రధాన అర్చకులు వెంకటసురేష్‌తో పాటు బొంతు శ్రీనివాస్, ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రావి నాగేశ్వరరావు, మామిళ్లపల్లి హరిబాబు, దురిశేటి శ్రీనివాస్, గుడిమెట్ల సోమేశ్వరరావు, ఇమ్మినేని శ్రీనివాస్, పోలిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న కేయూ ప్రొఫెసర్ సమ్మయ్య

తల్లాడ: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ఎన్ఆర్ఐ యన్నం శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగి న సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తాము ఈ స్థాయికి చేరామని తెలిపారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. ఇదే సమయాన సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు. ఖమ్మం ఫార్మసీ కళాశాల చైర్మన్ పోట్ల ఏసయ్య చౌదరి, కుర్నవల్లి పాఠశాల హెచ్‌ఎం ఝూన్సీరాణితో పాటు కొత్తపల్లి శ్రీని వాసరావు, శీలం సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్‌-2 విజేతకు సన్మానం

తల్లాడ: ఇటీవల వెల్లడైన గ్రూప్‌-2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించిన వడ్డే సాయిభార్గవ్‌ను సోమవారం పలువురు సన్మానించారు. తల్లాడ మండలం కలకొడిమకు చెందిన వడ్డే రమేష్‌బాబు– రజిని దంపతుల కుమారుడు సాయిభార్గవ్‌ను మాజీ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, బీఆర్‌ఎస్ నాయకుడు దిరిశాల దాసురావు సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తాళ్లూరి నాగభూషణం, తాళ్లూరి చిన్నా, ఆదూరి మారతమ్మ,ఐతమ్‌రాజు, తేళ్లూరి మల్లయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన వంకాయలపాటి చిన్నసీతయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని టీడీపీ నాయకుడు వాసిరెడ్డి రామనాథం, వీవీసీ ట్రస్ట్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నసీతయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు తేలుకుంట్ల శ్రీనివాసరావు, మేడా త్రివేణి, పసుపులేటి శ్రీనివాసరావు, కామేశ్వరరావు, మల్లాది సుధాకర్, ఆలస్యం బస్వయ్య, శంకర్‌రావు, వంకాయలపాటి లచ్చయ్య, సామినేని అప్పారావు, బాబురావు, నెల్లూరి రమేష్, గోగుల నర్సింహారావు, కోపూరి పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీ మహిళా యోజన'కు మంగళం?

వెబ్‌సైట్ మూతపడడంతో నిరాశ

కల్లూరురూరల్: రాష్ట్రప్రభుత్వం మైనార్టీ మహిళా యోజన పేరుతో వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళలతో పాటు ఒంటరి మహిళల ఉపాధి కోసం రూ.50వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు గతనెల 22నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మైనార్టీ మహిళా యువజన పథకం కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రం,పాన్‌కార్డు, భర్త మరణ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డు సమర్పించాలని వెల్లడించింది. అయితే, నిరుపేద మహిళలు చాలామందికి పాన్‌కార్డు లేకున్నా ప్రభుత్వ సూచనతో సర్టిఫికెట్లు తీసుకుంటుండగా సెప్టెంబర్ 24వ తేదీనే వెబ్‌సైట్ మూతపడింది. ఇక దరఖాస్తు గడువు సోమవారం ముగియగా.. గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వెబ్‌సైట్ నిలిపివేశారా, లేక పథకాన్ని రద్దు చేశారా అన్నది తెలియడం లేదు. ఈ విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో మైనార్టీ నిరుపేద వితంతువులు, ఒంటరి మహిళలు ఎదురు చూస్తున్నారు.

అతివలకు ఆరోగ్యమస్తు



మహిళలను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు (ఫైల్)

- 'స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్' పేరిట శిబిరాలు
- సత్తుపల్లి డివిజన్‌లో 120 క్యాంపులు

సత్తుపల్లిటౌన్: అతివల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పేరిట వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరాలకు మంచి స్పందన లభించింది. గతనెల 15నుంచి ఈనెల 2వ తేదీ వరకు సత్తుపల్లి డివిజన్‌లో నిర్వహించిన ఈ శిబిరాల్లో పెద్దసంఖ్యలో మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, దంత, చర్మవైద్యం తదితర ఎనిమిది విభాగాలకు సంబంధించిన నిపుణులు మహిళలతో పాటు బాలికలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

ఆస్పత్రులు.. కేంద్రాల్లో

మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా డివిజన్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఇవ్వడమే కాక రుగ్మతలు ఉంటే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతేకాక వ్యాధి తీవ్రత ఆధారంగా పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రతిరోజు 12 ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల్లోనూ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగాయి.

940మందికి..

మహిళలకు గర్భకోశ వ్యాధులు, ముక్కు, గొంతు, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, కంటి సమస్యలు, చర్మవ్యాధులు ఉన్నాయా అని పరీక్షించడమే కాక కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. మొత్తంగా 120 ప్రత్యేక క్యాంపులు నిర్వహించి 940 మంది మహిళలకు, బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వైద్యులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ శిబిరాల్లో సేవలు అందించారు.

మహిళల ఆరోగ్యానికి మేలు



స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరాలతో మహిళల ఆరోగ్య రక్షణకు మేలు జరగనుంది. డివిజన్‌లో 900మందికిపైగా మహిళలకు పరీక్షలు నిర్వహించాం. ఎక్కువగా గైనకాలజీ, కంటి, చర్మ సమస్యల కేసులే వచ్చాయి. రక్తహీనత బారిన పడకుండా అవగాహన కల్పించాం.

– డాక్టర్ టి.సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన



కళాశాల ఆవరణలో పరిశీలిస్తున్న అధికారులు

మధిర: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు ఖాజీపురం సమీపాన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను డీఆర్‌డీఓ సన్యాసయ్య సోమవారం పరిశీలించారు. తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుతో కలిసి భవనాన్ని పరిశీలించిన ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరు చేరిన ఎన్నికల సామగ్రి

కల్లూరురూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సామగ్రి కల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి సోమవారం చేరింది. ఎన్నికల నామినేషన్ ఫారాలు, నియమావళి పుస్తకాలు, కవర్లు, ఇతర సామగ్రి చేరుకుంది. ఈమేరకు ఎంపీడీఓ చంద్రశేఖర్ సామగ్రిని పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు.

శ్మశానవాటికకు దారి కోసం ఆందోళన



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ

వైరా/కొణిజర్ల: వైరాలోని హనుమాన్ బజార్ నుంచి శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని కొందరు ఆక్రమించుకోవడమే కాక అడిగితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఈమేరకు శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి హద్దులు నిర్ధారించాలనే డిమాండ్‌తో సోమవారం నిరసనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న కొణిజర్ల తహసీల్దార్ నారపోగు అరుణ, వైరా ఎస్‌ఐ పి.రామారావు చేరుకుని వారితో మాట్లాడారు. గతంలో ఉన్న తహసీల్దార్ హద్దులు కేటాయించినా ఆక్రమణదారులు రాళ్లు తొలగించి తమను ఇబ్బంది గురిచేస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. దీంతో రహదారిని తహసీల్దార్ అరుణ పరిశీలించి రికార్డుల ఆధారంగా వారంలోపు హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు. ఐబీ, రెవెన్యూ అధికారుల సంయుక్త సర్వే ద్వారా ప్రభుత్వ భూమి, చెరువు శిఖం భూములు ఉన్నాయా తేల్చాక రహదారి సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అయితే, దీనిపై కాలనీ వాసులు సంతృప్తి చెందక... సమస్య పరిష్కరిస్తేనే స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

రోడ్లను కమ్మేసిన కంప



పిచ్చిచెట్లతో మూసుకపోయిన ఎర్రుపాలెం - కేశిరెడ్డిపల్లి రహదారి

- పలుచోట్ల ప్రమాదకరంగా ప్రయాణం
- ఆందోళనలో వాహనదారులు



దెబ్బతిన్న ఎర్రుపాలెం - జమలాపురం రోడ్డు

ఎర్రుపాలెం: మండలంలోని పలు చోట్ల రహదారులపై ప్రయాణం ప్రమాదాలకు కారణమవుతోంది. ఎర్రుపాలెం నుంచి తెల్లపాలెం, కండ్రిక మీదుగా జమలాపురం వెళ్లే రహదారి పిచ్చి చెట్లు, కంపతో మూసుకుపోయినా అధికార యంత్రాంగం స్పందించడం లేదు. ఈ రహదారి మీదుగా జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం, కండ్రిక నుంచి జమలాపురం వరకు రోడ్డు వెంట పిచ్చిచెట్లు, కంప అలుముకున్నాయి. దీంతో రహదారి మూసుకుపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ మార్గంలో జమలాపురం వెళ్లే భక్తులు రాకపోకలు సాగిస్తారు. ఇక మండల కేంద్రం నుంచి తెల్లపాలెం వరకు రోడ్డు సైతం గుంతలమయంగా మారింది.

అధ్వానంగా కేశిరెడ్డిపల్లి రోడ్డు

మండల కేంద్రం నుంచి కేశిరెడ్డిపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని బీటీ రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. రేమిడిచర్ల క్రాస్ నుంచి కేశిరెడ్డిపల్లికి.. ఆపై ఏపీకి సరిహద్దు గ్రామం గూడెం మాధవరం వరకు ఉంటుంది. ఈక్రమంలో ఎర్రుపాలెం నుంచి కేశిరెడ్డిపల్లికి ప్రజలు నిరంతరం వెళ్లి వస్తుంటారు. అయినా రోడ్డు నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. ఈ మార్గంలోనే ఎన్‌ఎస్‌పీ కాల్వపై నిర్మించిన వంతెన రెండు వైపులా రెయిలింగ్‌లు విరిగిపోయాయి. ఇరుపక్కలా పిచ్చి చెట్లను తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఎర్రుపాలెం నుంచి కేశిరెడ్డిపల్లికి వెళ్లే రహదారిలో రెండు వైపులా పిచ్చిచెట్లు, కంప పెరిగాయి. దీంతో రహదారి మూసుకుపోయిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. రహదారిలో వంతెన కూడా ప్రమాదకరంగా ఉంది.

– దాసరి శ్రీనివాసరావు, కేశిరెడ్డిపల్లి

వాహనాలు కానరాక ప్రమాదాలు



మండలకేంద్రం నుంచి జమలాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఇరువైపులా పిచ్చిచెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నాగినేని ఉమామహేశ్వరరావు, వ్యాపారి, ఎర్రుపాలెం

దాడి ఘటనలో కేసు

చింతకాని: మండలంలోని కొదుమూరుకు నారపోగు కొండలరావుపై సోమవారం కేసు నమోదైంది. గ్రామ వాసి నారపోగు సావిత్రికి చెందిన గొర్రెలు రోడ్డుపైకి వచ్చాయని ఆమె ఇంటి సమీపాన ఉండే కొండలరావు గొడవ పడి ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

- మండలంలోని నాగులవంచకు ఆలేటి శ్రీను తన భార్య మారెమ్మను కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. కులపెద్దలు చెప్పినా ఆయన తీరులో మార్పు రాకపోవడంతో మారెమ్మ పోలీసులను ఆశ్రయించింది. దీంతో శ్రీనుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలజ్యోతి

కల్లూరురూరల్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని కల్లూరు ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలజ్యోతి పేర్కొన్నారు. చండ్రుపట్ల సెక్టార్ పరిధి బాలాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారం ఉపయోగపడుతుందని తెలిపారు. సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి..



విద్యార్థులతో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు

చింతకాని: విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరడం విద్యతోనే సాధ్యమవుతుందని పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఇంగ్లిష్ డిక్షనరీలను పంపిణీ చేశాక ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రద్ధగా చదువుతూ ఉన్నత స్థానాలకు చేరడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకు రావాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం కనపర్తి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం అంబటి శాంతయ్య, ఉపాధ్యాయులు కేశవులు, వెంకటరత్నం, చందర్‌రావు, రత్నకుమారి, వీరప్రసాద్, లక్ష్మణరావు, జయలక్ష్మి, రమేష్, షేక్ అఫ్జల్, సీఆర్‌పీ పద్మజ, టీడీపీ నాయకుడు తెలుకుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి/పెనుబల్లి: స్థానిక సంస్థల ఎన్నికలను తేలిగ్గా తీసుకోకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి శ్రేణులు కృషి చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. అధికారంలో లేనప్పుడే అన్ని జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకున్నామని తెలిపారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలం వీ.ఎం.బంజరలో సోమవారం జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఏ మాత్రం అశ్రద్ధ వహించకుండా స్థానిక నాయకత్వంతో సమాలోచనలు చేస్తూ ఎన్నికలను సవాల్‌గా తీసుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయినందున జెడ్పీటీసీలుగా సైతం బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. రిజర్వేషన్లు ఎలా ఉన్నా కార్యకర్తలు ఒక్కటిగా నిలబడి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సండ్ర సూచించారు. కాగా, కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం ఇవ్వకపోగా యూరియా పంపిణీలో విఫలమైందని ఆరోపించారు. సత్తుపల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించి రెండు నెలలు కావొస్తున్నా ప్రారంభించక శిథిల భవనంలో వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రేజర్లలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను అర్హులకు కాకుండా కాంగ్రెస్ జెండా కట్టిన వారికే ఇస్తున్నారని విమర్శించారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తలపించేలా కేసీఆర్ హయాంలో పాలన సాగితే ఇప్పుడు గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, ట్రాక్టర్లు మూలనపడ్డాయని తెలిపారు. ఈమేరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లేలా ఇంటింటి కార్డు అందించాలని సండ్ర పిలుపునిచ్చారు. ఈసమావేశాల్లో నాయకులు కూసంపూడి రామారావు, దొడ్డా శంకర్‌రావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, మోదుగు పుల్లారావు, కాలినేని వెంకటేశ్వరరావు, మందపాటి వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

- **కల్లూరురూరల్:** దసరా రోజున కల్లూరు మండలం కప్పలబంధంలో ప్రమాదానికి గురై మృతి చెందిన ఉపాధ్యాయుడు వేముల శ్రీనివాసరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, నాయకులు నందిగామ ప్రసాద్, జవాబురెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ వాటిని విస్మరించడంతో ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలను వంచించిన విషయాన్ని ఇంటింటికీ తెలియచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులుపోట్ల వెంకటప్రసాదరావు, పచ్చా సీతారామయ్య, బంకా మల్లయ్య, బిక్షం, ఖాజా పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

మధిర మండలంలో 16,419మంది



మధిర మండల పరిషత్ కార్యాలయం

మధిర: మధిర మండలంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను వారే నిర్ణయించే అవకాశముంది. మండలంలో 27 గ్రామపంచాయతీలకుగాను మొత్తం 31,728 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 16,419 మంది, పురుషులు 15,306మందితో పాటు ఇతరులు ముగ్గురు ఉన్నారని ఓటర్ల తుది జాబితా ద్వారా వెల్లడైంది.

వెంకటాపురంలో 262మందే...

మధిర మండలం వెంకటాపురం గ్రామపంచాయతీలో అతి తక్కువగా 262 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 127మంది, మహిళలు 135 మంది ఓటర్లు ఉన్నాయి. అలాగే, దెందుకూరు గ్రామపంచాయతీ పరిధిలో అతి ఎక్కువగా 3,552 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో పురుషులు 1,701, మహిళలు 1851 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. మధిర మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఎంపీపీతో జెడ్పీటీసీ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయింది. మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గంలో ఎక్కువ జీపీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించుకునేలా ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. కాగా, రిజర్వేషన్ల విషయమై స్పష్టత రాకపోవడంతో గ్రామాల్లో ఇంకా ఎన్నికల హడావుడి కనిపించడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే సామాజిక వర్గాల వారీగా బలాబలాలను సరిచూసుకుని రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను బరిలోకి దించే అవకాశముంది.

స్థానిక ఫొటోగ్రాఫర్లకు పని కల్పించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఫొటోగ్రాఫర్లు

తల్లాడ: త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని ఫొటోగ్రాఫర్లకు పని కల్పించాలని అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీడీఓ సురేష్‌బాబుకు అసోషియేషన్ అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ ఆధ్వర్యాన వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో స్థానిక ఫొటోగ్రాఫర్లకే పని కల్పించి, ఉపాధి చేకూర్చాలని కోరారు. ఫొటోగ్రాఫర్లు గురిజాల నారాయణరావు, ఎస్.కే.ఆసిఫ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే కేన్సర్ దూరం



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్

మధిర: మహిళలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ కేన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ సూచించారు. మధిరలోని ఆరోగ్య ఉపకేంద్రం-2 వద్ద సోమవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు పృథ్వీరాజ్, జాహ్నవి మాట్లాడుతూ కేన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లక్షణాలను వివరించారు. అలాగే, పరీక్షల నిర్వహణ, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, సుబ్బలక్ష్మి, విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

గుంతలు పూడ్చండి ప్రభో



ఎర్రుపాలెం మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ నుండి జయంతి గ్రామం వెళ్లే పంచాయతీరాజ్ ప్రధాన రహదారిపై గుంతలు పడ్డాయి. అడుగడుగునా మోకాలి లోతు గుంతలు ఉండగా ఇటీవల వర్షాలతో నీరు చేరింది. దీంతో గుంతలు ఉన్నాయని తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : నరేష్, ఏఈ, పంచాయతీరాజ్
సెల్ నంబర్ : 83309 11076